# విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.671.45 కోట్లు జమ



అమరావతి, ఏప్రిల్ 19:ఏపీలో జగనన్న విద్యాదీవెన పథకాన్ని సోమవారం నాడు సీఎం జగన్ ప్రారంభించారు. ఈ మేరకు జగనన్న విద్యా దీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్క క్లిక్‌తో నగదు జమ చేశారు. 2020?21 ఫీజు రీయింబర్స్‌మెంట్ మొదటి విడత నగదు కింద అర్హులైన 10,88,439 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.671.45 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పడుతున్నాయి.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ? జగనన్న విద్యా దీవెన పథకం గొప్ప కార్యక్రమమని చెప్పారు. చదువుతోనే జీవితాలు రూపురేఖలు మారతాయని తెలిపారు. పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని, పిల్లల ప్రతి అడుగులో ప్రభుత్వం తోడుగా ఉంటుందని చెప్పారు. 2018–19 బకాయిలు రూ.1,800 కోట్లను కూడా తమ ప్రభుత్వమే చెల్లించిందని గుర్తు చేశారు. 2019–20 ఏడాదికి పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించామని జగన్ వెల్లడించారు.

# కరోనాతో ముగ్గురు సచివాలయం ఉద్యోగులు మృతి



అమరావతి, ఏప్రిల్ 19:ఏపీ సచివాలయం లో కరోనా కలకలం సృష్టించింది. ఇప్పటికే ఇద్దరు సచివాలయం ఉద్యోగులు మృతిచెందగా.. తాజాగా ఏపీ సచివాలయానికి చెందిన మరో ఉద్యోగిని కరోనాతో మృతి చెందారు. పంచాయతీ రాజ్ శాఖలో సెక్షన్ ఆఫీసరుగా పని చేస్తున్న శాంత కుమారి ఇవాళ ఉదయం కరోనాతో కన్నుమూశారు. రెండు రోజుల క్రితం శాంత కుమారి భర్త సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేస్తున్న వి.పద్మా రావు కూడా కరోనాతో మృతి చెందారు. సచివాలయం ఉద్యోగులు ఇలా కరోనాతో మృతి చెందడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తమకు వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని కోరుతున్నారు.

సచివాలయంలో కరోనాతో ముగ్గురు ఉద్యోగులు మృతి చెందడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిగ్ర్భ్భాంతి వ్యక్తం చేశారు. కరోనాతో మృతి చెందిన సాధారణ పరిపాలన శాఖలో సెక్షన్ ఆఫీసర్ జి.రవికాంత్, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ సెక్రెటరీ గా పనిచేస్తున్న పద్మారావుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. మృతి చెందిన ఉద్యోగుల ఆత్మకు శాంతి కలగాలని తన చాంబర్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులు కోవిడ్ జాగ్రత్తలను పాటించాలని, ఎక్కడైనా అస్వస్థత, అనారోగ్య లక్షణాలు కనిపించగానే పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రాల్లో తప్పనిసరిగా కాల వ్యవధిని అనుసరించి రెండు టీకాలను వేయించుకోవాలని కోరారు. కోవిడ్ సెకండ్ వేవ్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వుండాలని కోరారు. మాస్క్ తప్పని సరిగా ధరిస్తే, భౌతికదూరంను పాటించాలని సూచించారు.

# శౌర్య పురస్కారాల పోర్టల్ ద్వారా "ఇన్నోవేటివ్ ట్రిబ్యూట్స్ టు బ్రేవ్ హార్ట్స్" పోటీ

హైదరాబాద్, ఏప్రిల్ 19:శౌర్య పురస్కార విజేతలైన సైనికులు దేశ సేవలో చూపిన అసమాన ధైర్యం, త్యాగనిరతికి దేశ జ్ఞాపకాల్లో విశిష్ట స్థానం ఉంటుంది. శౌర్య పురస్కార గ్రహీతలను గౌరవించటానికి, ప్రజలు వారిని ఎప్పటికీ గుర్తుంచుకునేలా చేయడానికి శౌర్య పురస్కారాల పోర్టల్ (www.gallantryawards.gov.in) మన దేశ తొలి ఆన్‌లైన్ వేదికగా సేవలందిస్తోంది.

ఈ పోర్టల్, "ఇన్నోవేటివ్ ట్రిబ్యూట్స్ టు బ్రేవ్ హార్ట్స్" పోటీని నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న పోటీదారులను ఆహ్వానిస్తోంది. వీర సైనికులకు విశిష్టంగా, సృజనాత్మకతతో నివాళులు అర్పించే కార్యక్రమాన్ని పోటీదారులు రూపొందించాలి. శౌర్య పురస్కార గ్రహీతల గౌరవం పెంచేలా, తగిన నివాళి సందేశాలను రూపొందించడం ఈ పోటీ లక్ష్యం. ఈ నెల 15న ప్రారంభమైన పోటీ వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది.

పోటీలో భాగంగా దరఖాస్తులను స్వీకరిస్తారు. సృజనాత్మకత, వాస్తవికత, కూర్పు, సరళతతోపాటు, శౌర్య పురస్కారాల పోర్టల్ ఆలోచనలు, లక్ష్యాలను ఎంత స్పష్టంగా అవి చూపుతున్నాయి అన్న అంశాల ఆధారంగా దరఖాస్తుల అర్హత నిర్ణయిస్తారు. శౌర్య పురస్కారాల పోర్టల్, దాని సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా విజేతలను నిర్ణయిస్తారు. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే అవకాశాన్ని కూడా విజేతలకు కల్పిస్తారు. పోటీలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు 'https://www.gallantryawards.gov.in/single_challenge/event/46'ను చూడవచ్చు.

ప్రజల్లో దేశభక్తి, భక్తి, అంకితభావాన్ని పెంచే చురుకైన, స్నేహపూర్వక వేదికగా శౌర్య పురస్కారాల పోర్టల్ పనిచేస్తోంది. మన దేశ శౌర్య పురస్కార గ్రహీతలకు నివాళులు అర్పించే అవకాశాన్ని ఈ పోర్టల్ ప్రజలకు కల్పిస్తోంది.

# గాలి ద్వారా నిశ్శబ్ద వైరస్ వ్యాప్తి అతి ప్రమాదకరం...!

**('లాన్‌సెట్ మెడికల్ జర్నల్' తాజా పరిశోధనా వ్యాసం ఆధారంగా)**

కోవిడ్–19 వ్యాధికి కారణమైన సార్స్–కోవ్–2 వైరస్ వ్యాప్తి అత్యధికంగా గాలి మాధ్యమంగా జరుగుతుందనడానికి స్థిరమైన, బలమైన సాక్ష్యాలు లభించాయని తాజాగా 16 ఏప్రిల్ 2021న విడుదలైన లాన్‌సెట్ మెడికల్ జర్నల్ ప్రచురించిన పరిశోధనా వ్యాసం కఠిన వాస్తవాలను వెల్లడించింది. యూకె, యూయస్ మరియు కెనడాకు చెందిన ఆరుగురు శాస్త్రజ్ఞులు జరిపిన పరిశోధనలకు సంబంధించిన 10 ముఖ్య అంశాలు పలు ఆసక్తికర, ఆశ్చర్యకర వాస్తవాలను వెల్లడించాయి. గాలి ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి వేగంగా జరుగుట వల్ల కట్టడి సవాళుగా మారుతూ లక్షల్లో కేసులు బయట పడడం జరుగుతోందని తెలిపారు. గతంలో జూలై–2020 మాసంలో 32 దేశాలకు చెందిన 200 మంది శాస్త్రజ్ఞులు కూడా గాలి ద్వారా వైరస్ వ్యాప్తి జరుగుతుందని వెల్లడించిన విషయం మనకు తెలుసు. ఇలాంటి సందర్భంలో ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు ఇతర ముఖ్య ఆరోగ్య సంస్థలు తగు పక్కా సూచనలను ప్రపంచ మానవాళికి సత్వరమే చేయాలని కోరుతున్నారు. ఒకే కరోనా సోకిన వ్యక్తితో 53 మందికి వైరస్ సంక్రమించడం జరిగిందనే 'సూపర్ స్ప్రెడర్' ఘటనను కనుగొన్నామని వివరించారు. ఈ విషయంలో వ్యక్తులు సమీపంగా మసలడం లేదా ఒకే వస్తు ఉపరితలాలను వాడడం ద్వారా కరోనా వ్యాప్తి ఎక్కువగా జరుగడం లేదని గమనించారు. మూసి ఉన్న గదుల్లో వ్యాప్తి వేగంగా జరుగుతోందని, బయటి వాతావరణంలో వ్యాప్తి తక్కువని మరియు గదిలో వెంటిలేషన్ సక్రమంగా ఉన్నపుడు వైరస్ వ్యాప్తి తగ్గుతుందని వెల్లడించారు.

కరోనా సోకిన వ్యక్తుల్లో లక్షణాలు లేని ఎసిమ్టమాటిక్ కేసుల నుంచి 'నిశ్శబ్ద గాలి ద్వారా వైరస్ వ్యాప్తి' 33 – 59 శాతం జరుగుతోందని తెలిపారు. పక్క పక్క గదుల్లో (హోటల్స్) ఉండే వారు దగ్గరగా లేకపోయినా 'లాంగ్ రేంజ్ వ్యాప్తి'గా కరోనా సోకవచ్చని తెలుస్తోంది. వ్యక్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు, గట్టిగా మాట్లాడినపుడు వెలువడే తుంపర బిందువుల ద్వారా వైరస్ వ్యాప్తి ఎక్కువ దూరం జరగదని, అవి వెంటనే భూమ్యాకర్షణతో సమీపంలోనే పడిపోవడం జరుగుతుందని కనుగొన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఆరు గజాల సామాజిక దూరాలు పాటించడంతో కరోనా కట్టడి ఇప్పటి వరకు జరిగినా, గాలి ద్వారా ఏరోసోల్ వ్యాప్తి అతి ప్రమాదకరంగా మారిందని కొత్తగా గమనించారు. కరోనా సోకిన వ్యక్తులు మాట్లాడినా, అరిచినా, దగ్గినా, తుమ్మినా, ఉచ్ఛ్వాసనిశ్వాసల వల్ల కూడా వైరస్ వ్యాప్తి గాలి మాధ్యమంగా వేగంగా జరుగుతున్నదని హెచ్చరించారు. గాలిలో వైరస్ 3 గంటల వరకు చురుకుగా ఉండగలదని గమనించారు.

గాలి ద్వారా వ్యాప్తిని కట్టడి చేయడానికి గది వెంటిలేషన్, గాలి వడపోత (ఎయిర్ ఫిల్ట్రేషన్), గుమిగూడకుండా చూసుకోవడం, మూసిన గదుల్లో ఎక్కువ సమయం ఉండకుండా, సదా నాణ్యమైన మాస్కులు ధరించడం లాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్య సిబ్బంది కరోనా తుంపరల కట్టడి నియమాలను పాటించినా, గాలి ద్వారా ఏరోసోల్ 'నాసోకోమియల్ ఇన్ఫెక్షన్' రూపంలో వైరస్ వ్యాప్తిని అరికట్టలేమని తెలుసుకున్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టటంలో ప్రతి ఒక్కరు నాణ్యమైన మాస్కులు ధరించడం, గదిలో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం, గదిలో సమూహాలుగా ఉండక పోవడం లాంటి పలు నియమాలను పాటించడానికి కంకణబద్ధులం అవుదాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# వారణాసీలో కోవిడ్-19పై ప్రాంతీయ ప్రజా ప్రతినిధులతో, అధికారులతో మాట్లాడిన ప్రధాన మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 19:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వారాణసీ జిల్లా లో కోవిడ్–19 స్థితి పై వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా సమీక్ష ను నిర్వహించారు. సమావేశం సాగిన క్రమం లో కరోనా బారి నుంచి కాపాడుకోవడం తో పాటు కరోనా సోకిన రోగులకు సముచిత చికిత్స ను అందించడానికి గాను నిర్ధారణ పరీక్షలు, పడక ల అందుబాటు, మందులు– టీకాలు, మానవ వనరుల గురించి ప్రధాన మంత్రి కి వివరాలను తెలియజేయడమైంది. ఆయన ప్రజల కు అన్నివిధాలుగాను అవసరమైన సహాయాన్ని త్వరగా అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు.

ప్రతి ఒక్కరు "రెండు గజాల దూరం, మాస్కు ను ధరించడం" అనే నియమాలను తప్పనిసరిగా పాటించాలని చర్చ లో భాగం గా ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. టీకాకరణ కార్యక్రమం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, 45 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరి కి తప్పకుండా టీకామందును ఇచ్చేలా చూసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వారాణసీ జిల్లావాసులందరికీ అత్యంత సూక్ష్మదృష్టి తో అవసరమైన అన్ని రకాల సహాయం అందించాలని ఆయన సూచించారు.

దేశం లోని వైద్యుల కు, వైద్య సిబ్బంది కి ప్రధాన మంత్రి ఈ సందర్భం లో కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ ఇటువంటి సంక్షోభ సమయంలోనూ వారు వారి కర్తవ్యాన్ని నిష్ఠ తో నిర్వర్తిస్తున్నారన్నారు. మనం కిందటి ఏడాది లో ఎదురైన అనుభవాల నుంచి పాఠాలను నేర్చుకొని, అప్రమత్తం గా ఉండూ ముందుకు సాగిపోవాలి అని ఆయన అన్నారు.

వారాణసీ కి ప్రతినిధి అయిన తాను, సాధారణ ప్రజానీకం నుంచి కూడా నిరంతరం సమాచారాన్ని స్వీకరిస్తున్నట్లు ప్రధాన మంత్రి వెల్లడించారు. వారాణసీలో గడచిన 5–6 సంవత్సరాలు వైద్యపరంగా మౌలిక సదుపాయాల విస్తరణ–ఆధునికీకరణ చేపట్టడం వల్ల కరోనా పై పోరు లో తోడ్పాటు లభించింది అని ఆయన పేర్కొన్నారు. వారాణసీ లో వైద్య సదుపాయాల మెరుగుదల సహా పడక ల ను, ఐసీయూ సౌకర్యాన్ని, ఆక్సిజన్ లభ్యత ను కూడా పెంచడం జరుగుతోందన్నారు. వ్యాధి పీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నందున అన్ని స్థాయులలోనూ ఒత్తిడి ని తట్టుకునేలా అన్ని చర్యలనూ ముమ్మరం చేయవలసి ఉందని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. వారాణసీ పాలన యంత్రాంగం "కాశీ కోవిడ్ రిస్పాన్స్ సెంటర్" ఏర్పాటు లో ఏ విధమైన వేగాన్ని ప్రదర్శించిందో, అదే మాదిరి వేగాన్ని ప్రతి ఒక్క పని లో కూడాను ప్రదర్శించాలి అని ఆయన అన్నారు.

మహమ్మారి వంటి వైరస్‌ల పై విజయం దిశ గా తొలి దశ తరహా లోనే మలి దశ లోనూ 'టెస్ట్, ట్రాక్ ఎండ్ ట్రీట్' వ్యూహం తో పోరు ను కొనసాగించవలసి ఉందని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. అదే సమయం లో వ్యాధిగ్రస్తులను కలసిన వారందరి జాడ ను వీలైనంత వేగం గా కనుగొని, పరీక్షల నిర్వహణ కు ప్రాధాన్యాన్ని ఇవ్వాలి అని ఆయన స్పష్టం చేశారు. వ్యాధి పీడితులు, ఇంటి వద్ద నిర్బంధ వైద్య పర్యవేక్షణ లో గల వారి కుటుంబ సభ్యుల విషయంలో అన్ని బాధ్యతలనూ నిర్వర్తించాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. ఈ చర్యల సమయం లో అత్యంత సూక్ష్మదృష్టి తో వ్యవహరించవలసిన అవసరాన్ని గుర్తించాలని మరీ మరీ చెప్పారు.

వారాణసీ లో స్వచ్ఛంద సంస్థ లు ప్రశంసనీయమైన విధం గా ప్రభుత్వానికి సహకరిస్తున్నాయి అని ప్రధాన మంత్రి కొనియాడుతూ, అలాంటి సంస్థల ను అధికార యంత్రాంగం మరింత ప్రోత్సహించాలని సూచన చేశారు. ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్దడంలో పటిష్ఠమైన నిష్ఠ, నిశిత దృష్టి అవసరం అని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ బారి నుంచి కాపాడుకోవడం– చికిత్స లకు సంబంధించి చేసిన వివిధ ఏర్పాటులను గురించి వారాణసీ ప్రాంతీయ ప్రజా ప్రతినిధులు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన మంత్రి కి నివేదించారు. వ్యాధిగ్రస్తుల తో సంబంధాలు ఉన్న వారి జాడ తీసేందుకు కంట్రోల్ రూములతో పాటు నిర్బంధ గృహ వాసం లో చికిత్స పర్యవేక్షణ కు గాను కమాండ్ కంట్రోల్ సెంటర్ ల ను ఏర్పాటు చేసిన సంగతి ని ప్రధాన మంత్రి దృష్టి కి వారు తీసుకువచ్చారు. అలాగే ఏమ్ బ్యులన్స్ వసతి కల్పన కు ప్రత్యేకమైనటువంటి ఫోన్ నంబరు, కంట్రోల్ రూము ల నుంచి టెలిమెడిసిన్ సదుపాయం, పట్టణ ప్రాంతాల లో అదనం గా ర్యాపిడ్ రిస్ పాన్స్ టీమ్ నియామకం వగైరాలను గురించి ప్రధాన మంత్రి కి తెలియజేయడమైంది. కోవిడ్ నియంత్రణ లో భాగంగా ఇప్పటి వరకు 1,98,383 మంది వ్యక్తులకు ఒకటో మోతాదు టీకామందు ను, 35,014 మంది వ్యక్తులకు టీకా మందు తాలూకు రెండో మోతాదు ను ఇవ్వడం పూర్తి అయిందని ప్రధాన మంత్రి కి తెలియజేయడం జరిగింది.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్ ఎల్ సి/ కోవిడ్ వారాణసీ ఇన్ చార్జి శ్రీ ఎ.కె.శర్మ, జోనల్ హెడ్ శ్రీ దీపక్ అగ్రవాల్, పోలీస్ కమిషనర్ శ్రీ ఎ. సతీశ్ గణేశ్, జిల్లా కలెక్టర్ శ్రీ కౌశల్ రాజ్ శర్మ, మ్యూనిసిపల్ కమిశనర్ శ్రీ గౌరాంగ్ రాఠీ, ముఖ్య చికిత్స అధికారి డాక్టర్ ఎన్.పి. సింహ్, ఐఎమ్ఎస్– బిహెచ్ యు సంచాలకులు ప్రొఫెసర్ బి.ఆర్. మిత్తల్ , రాష్ట్ర మంత్రులు శ్రీ నీలకంఠ్ తివారీ, శ్రీ రవీంద్ర జాయస్ వాల్, రోహనియా ఎమ్ ఎల్ ఎ శ్రీ సురేంద్ర నారాయణ్ సింహ్, ఎమ్ ఎల్ సి శ్రీ అశోక్ ధవన్, ఎమ్ ఎల్ సి శ్రీ లక్ష్మణ్ ఆచార్య పాల్గొన్నారు.

# ఏపీలో స్కూళ్లు మూసివేత.. పరీక్షలు యథాతథం

అమరావతి, ఏప్రిల్ 19:కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కూళ్లలోనూ కరోనా విస్తరిస్తున్న సమయంలో పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించింది. దీంతో మంగళవారం నుంచి స్కూళ్లు మూసివేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు స్కూళ్లు వేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. కరోనా పరిస్థితులపై సోమవారం సీఎం జగన్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో స్కూళ్లు బంద్ చేయాలని నిర్ణయించారు.అటు స్కూళ్లు మూసివేసినా పరీక్షలను మాత్రం యథావిధిగా నిర్వహిస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారమే 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు జరుగుతాయని మంత్రి ప్రకటించారు. చిన్నారులు వైరస్ బారిన పడుతూ, ఇంట్లో వారు వైరస్ బారిన పడేందుకు కారణం అవుతున్నాయన్న అంశాలను



పరిగణనలోకి తీసుకుని 9వ తరగతి వరకు పాఠశాలలను మూసివేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేస్తామన్నారు. అటు ఈసారి ఇతర రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలను రద్దు చేసినప్పటికీ? విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే పరీక్షలు పెడుతున్నామని, క్లాసుల నిర్వహణ పూర్తైనందున పరీక్షలను కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు.

# ప్రభుత్వం అండగా నిలుస్తుంది..ఎమ్మెల్యే

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలంగాణలో నివసిస్తున్న ప్రతి నిరుపేద కుటుంబానికి టిఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముషీరాబాద్ నియోజకవర్గం శాసనసభ్యులు ముఠా గోపాల్ అన్నారు. కరోనా వైరస్ నివారణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న ఆదేశాలు పాటించాలని ఆయన కోరారు. కరోనా నివారణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆయన వెల్లడించారు. భోలక్‌పూర్‌లోని వివిధ బస్తీలలో శానిటైజర్ చేయించి ప్రజల్లో కరోనా పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నారని.. ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాల మేరకు అందరికి ఉచితంగా వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. వివిధ బస్తీలలో నివసిస్తున్న వారికి ఏలాంటి ఇబ్బంది కలగకుండా సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసిఆర్ కరోనా నివారణకు చర్యలు తీసుకుంటున్నాట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు ముఠా జయసింహ్మా, మహ్మద్‌అలీ, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి వేడుకలను ఏకాంతంగా నిర్వహించండి ..స్వరూపానందేంద్ర స్వామి



అమరావతి, ఏప్రిల్ 19:కరోనా దృష్ట్యా ఈ నెల 21న జరిగే శ్రీరామ నవమి వేడుకలను ఏకాంతంగా నిర్వహించాలని ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలకు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి సూచించారు. అదేవిధంగా ఆలయాల్లో ఉత్సవాలు, గ్రామాల్లో జాతరలకు పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించాలని తెలిపారు. హరిద్వార్ కుంభమేళాలో విశాఖ శారదాపీఠం చేపట్టిన అన్న ప్రసాద వితరణను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. 50 రోజులుగా వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు చెప్పారు. నాగ బాబాలు, సాధువులు, అఖాడాలకు కుంభమేళా సమయంలో సేవలందించినట్లు స్వరూపానందేంద్ర స్వామి పేర్కొన్నారు

# శంషాబాద్ వద్ద కారు - లారీ ఢీ: ఆరుగురు దుర్మరణం





హైదరాబాద్, ఏప్రిల్ 19:జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శంషాబాద్‌లో కారును లారీ ఢీకొన్న సంఘటనలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మంది గాయపడ్డారు. లారీ కింద ఆరుగురు కూరగాయల వ్యాపారులు చిక్కుకున్నారు. ప్రమాద సమయంలో 30 పైగా కార్మికులు ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీస్ లు అక్కడికీ చేరుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రి కి తరలించారు

# మినీ పోరు పట్టుకు హస్తం పాట్లు..

హైదరాబాద్, ఏప్రిల్ 19:హైదరాబాద్, : వరస ఎన్నికల్లో ఓటమిపాలవుతున్న కాంగ్రెస్ పార్టీ ఈ మినీ పురపోరు సవాల్‌గా మారింది. ఈ ఎన్నికల్లో కాస్త పరువు దక్కించుకోవాలనే ఆలోచనతో హస్తం పార్టీ ముందుకు సాగుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి కలిసొచ్చే పార్టీలతో పొత్తులు తదితర అంశాలపైన స్థానిక నాయకత్వానికి పీసీసీ పూర్తి స్వేచ్ఛ నిచ్చింది. అభ్యర్థుల తరపున ప్రచారం కూడా ఆయా జిల్లా నాయకులకే అప్పచెప్పారు. ప్రధానంగా వరంగల్, ఖమ్మం కార్పోరేషన్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగానే తీసుకున్న కాంగ్రెస్.. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ రెండు కార్పోరేషన్లకు పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల కమిటీలు నియ మించారు. ఈ కమిటిలే స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, ఇతర పార్టీలకు చెంది న బలాబలాలు, సామాజిక సమీకరణాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టింది. మిగతా మునిసిపాలిటిల్లో కూడా స్థానిక నాయక త్వంపైనే పీసీసీ భారం వేసింది. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత వారికే అ ప్పచెప్పారు. ఈ రెండు కార్పోరేషన్లు, మిగతా ఐదు మునిసిపాలిటిల్లో పోటి చేసే అభ్యర్థులకు సంబంధించిన బీ–ఫారాలను మాత్రం అభ్యర్థులకు ఇవ్వకుండా .. నేరుగా 22న ఎన్నికల రిటర్నింగ్ అధికారులకే పీసీసీ పరిశీలకుడి ద్వారా డీసీసీ లేదా నగర కాం గ్రెస్ అధ్యక్షుల ద్వారా అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నది. అధికార టీఆర్ఎస్ నుంచి వచ్చే ముప్పును తట్టుకోవాలంటే ఈ నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ముఖ్యనేత అభిప్రాయపడ్డారు. ఏం దుకంటే నామినేషన్ల వేసిన కాంగ్రెస్ అభ్యర్థులను బెదిరించి, లేదంటే డబ్బుల ఆశ చూపి చివరి నిమిషంలో నామినేషన్లు ఉపసంహరింపచేసే కుట్రలు జరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం వరంగల్ కార్పోరేషన్ కాంగ్రెస్ సమావేశంలో పార్టీకి నమ్మక ద్రోహం చేయవద్దు అని మాజీ మంత్రి కొండా సురేఖ కూడా చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇతర పార్టీల్లోని అసంతృప్తులను కాంగ్రెస్‌లోకి చేర్చుకునే పనిలో ఆ పార్టీ నేతల నిమగ్నమయ్యారు. ప్రధానంగా అధికార టీఆర్ఎస్‌లోని నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.

# ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి..

హైదరాబాద్, ఏప్రిల్ 19:కరోనా వైరస్ ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ మున్సిపల్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సూచించారు. కరోనా నివారణ అమలుకు ప్రతి ఒక్కరు సహాకరించి, దయచేసి ఇంటికే పరిమితం కావాలని ఆమె కోరారు. డివిజన్‌లోని వివిధ బస్తీలలో శానిటైజర్ చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కరోనా వైరస్ ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత, స్వీయ నియంత్రణ, సామాజిక దూరం తప్పని సరిగా పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. కరోనా వైరస్ నివారణకు అందరూ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల క్షేమం కోసం అందరూ పోలీసుల ఆదేశాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆమె అన్నారు.

# నిరుపేదలకు వరం సిఎం సహాయ నిధి..



హైదరాబాద్, ఏప్రిల్ 19: నిరుపేదలకు వరం సిఎం సహాయ నిధి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బొయిన్‌పల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవి ఆధ్వర్యంలో పాత గబ్బిలాల పేటకు చెందిన లక్ష్మీ, నరేష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందన్నారు. ఆరోగ్య శ్రీ పరిధిలోనికి రాని వైద్య చికిత్సలు చేయించుకున్న వారి ఇబ్బందులను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా నిలుస్తుందని అన్నారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా పేద ప్రజల ఇబ్బందులు దూరం అవుతాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని కొనియడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, యువజన సంఘం నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగాసౌకర్యాలు కల్పించాలంటూ మున్సిపల్ చైర్మన్, కమీషనర్ కలిసిన ముస్లిం నాయకులు



రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 19 (నేటినిజం ప్రతినిధి)::రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా మున్సిపల్ ద్వారా వేములవాడలోని మసీదులలో శానిటేషన్ తదితర ఏర్పాట్లు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సర్వర్ అలీ బాబును ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ రామతీర్థ పు మాధవి రాజు, మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్ రావు ను మొహమ్మద్ , న్యూ అర్బన్ కాలీని మస్జిద్ అధ్యక్షులు షేక్ ఇమామ్ , రజాక్ వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాధవి రాజు మాట్లాడుతూ రంజాన్ మాసంలో మున్సిపల్ పాలకవర్గం ద్వారా సకల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు మస్జిద్ వద్ద శానిటైజర్ చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ మస్జిద్ కమిటీ కోశాధికారి అజ్మత్‌అలీ, ఉపాధ్యక్షుడు షరీఫ్ , టీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఎండీ అంజద్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తి మండలంలో పెరుగుతున్న కరోనా కేసులు

రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 19 (నేటినిజం ప్రతినిధి)::చందుర్తి మండలంలో రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నాయి, మండలంలో సోమవారం 137 మంది కి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ఇందులో 37 మందికి పాజిటివ్గా వచ్చినట్లు చందుర్తి ప్రభుత్వ వైద్యాధికారి మసూద్ అహ్మద్ తెలిపారు, ఇందులో చందుర్తి లో ఆరుగురికి, జోగాపూర్ లో నలుగురికి, మూడపల్లి లో ఇద్దరికీ, సనుగుల లో ముగ్గురికి, కట్ట లింగంపేట లో ఒకరికి, లింగంపేట లో ఒక్కరికి, మల్యాల లో పదిమందికి, రామన్నపేట లో ఒకరికి, ఆశి రెడ్డి పల్లెలో ఇద్దరికీ, కిష్టం పేటలో ఒకరికి, ఎనగంటి లో ఒకరికి, రుద్రంగిలో నలుగురికి, మర్రిపల్లి లో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు, కరోనా సోకకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా మాస్కులు ధరించాలని, అలాగే బౌతిక దూరం పాటించాలని పిలుపునిచ్చారు,అలాగే 197 మందికి కోవిడ్ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి తెలిపా

# ఉనికి కోసమే కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

## - చందుర్తి మండల టిఆర్ఎస్ నాయకులు

రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 19 (నేటినిజం ప్రతినిధి):: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉనికి కోసమే పాదయాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నారని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మరాఠీ మల్లిక్ లు అన్నారు, సోమవారం చందుర్తి మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2004 నుండి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రోడ్డు నిర్మాణం గురించి ఏనాడు ఆలోచన చేయలేదని, ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, నిధులు మంజూరు చేయాలని ఉమ్మడి అసెంబ్లీలో ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడడం జరిగిందని గుర్తు చేశారు, చందుర్తి నుండి మోత్కూరావు పేట వరకు దాదాపు రోడ్ పనులు పూర్తయ్యాయని అటవీ శాఖ అనుమతి లేకపోవడంతో కాస్త నిర్మాణం ఆగిపోయిందని అటవీశాఖ అనుమతులు కూడా కొలిక్కి వచ్చాయని వారు గుర్తు చేశారు, ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతోనే ఈ రోడ్డు నిర్మాణ పనులు జరిగాయని అన్నారు, కేవలం పార్టీ ఉనికి కోసమే పాదయాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నారని అన్నారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉ న్నప్పుడు మోత్కూరావు పేట రోడ్డు నిర్మాణం కోసం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేయడం జరిగిందన్నారు, ఎమ్మెల్యే రమేష్ బాబు నిరంతరం నియోజక ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడుతున్నాడని గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అబ్రహం, సర్పంచులు లింగంపల్లి సత్తయ్య, లక్ష్మీనారాయణ, ఎంపిటిసిలు మాదాసు వేణు,పెగ్గర్ల రమేష్ రావు,నాయకులు దప్పుల అశోక్, బత్తుల కమలాకర్,ప్రసాద్, ఏనుగుల శ్రీనివాస్, దారం బాల్రెడ్డి, శేఖర్, సతీష్, హరీష్,జలంధర్,కత్తి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు,



# జల్ జీవన్ మిషన్: కర్ణాటక 2022 మార్చి నాటికి 25 లక్షల ట్యాప్ కనెక్షన్లను అందించాలని భావిస్తోంది

హైదరాబాద్, ఏప్రిల్ 19:జల్ జీవన్ మిషన్ కింద కర్ణాటక ఆ రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించింది. 2021-22 సంవత్సరానికి రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికతో పాటు సంతృప్త ప్రణాళిక వివరాలను సమర్పించింది. తద్వారా ప్రతి గ్రామీణ నివాసానికి నీటి కనెక్షన్ అందుతుంది. 2021-22లో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 25 లక్షల ట్యాప్ కనెక్షన్లను అందించాలని ఆ రాష్ట్రం యోచిస్తోంది.

కర్ణాటక రాష్ట్రంలో 91.19 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 28.44 లక్షలు (31.2%) గృహాలకు మాత్రమే కుళాయి నీటి సరఫరా ఉంది. ఇప్పటివరకు రాష్ట్రంలోని 23 పంచాయతీలు మరియు 676 గ్రామాలను 'హర్ ఘర్ జల్'గా ప్రకటించారు, అంటే ప్రతి గ్రామీణ ఆవాసానికి కుళాయి నీటి సరఫరా. ప్రతి ఇంటిలో నీటి నిర్వాహకులుగా ఉన్న స్త్రీలు మరియు యువతులకు 'జీవన సౌలభ్యాన్ని' అందించడమే కాకుండా విద్యను అభ్యసించడానికి, విభిన్న వృత్తులను నేర్చుకోవడానికి, వారి అప్‌గ్రేడ్ చేయడానికి సమయాన్ని అందించడం తద్వారా సమాజాన్ని శక్తివంతం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశం. ఈ కార్యక్రమం ద్వారా కుటుంబంతో సమయాన్ని గడపడంతో పాటు నీటి కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన దుస్థితి తప్పుతుంది.

కర్ణాటకలో 95% పాఠశాలలు మరియు 95% అంగన్వాడీ కేంద్రాలు, 84% ఆశ్రమశాలలు, 91% గ్రామ పంచాయతీ భవనాలు మరియు 92% ఆరోగ్య కేంద్రాలకు నీటి కనెక్షన్లు ఉన్నాయి. రాబోయే కొద్ది నెలల్లో అభ్యాస కేంద్రాలు, జిపి భవనం మరియు ఆరోగ్య కేంద్రాలను కవర్ చేయాలని రాష్ట్రం యోచిస్తోంది. ప్రజల్లో గ్రేవాటర్ నీటి నిర్వహణ మరియు ప్రవర్తన మార్పు అత్యవసరం. తద్వారా పరిమిత వనరు అయిన నీటిని న్యాయబద్ధంగా వినియోగిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కరువు పీడిత మరియు ఎడారి ప్రాంతం, ఎస్సీ / ఎస్టీ ఆధిపత్య నివాసాలు, ఆకాంక్ష జిల్లాలు మొదలైన వాటికి ప్రాధాన్యతనిచ్చే 17,111 గ్రామాలను కవర్ చేయాలని రాష్ట్రం యోచిస్తోంది.

రాష్ట్రం సమర్పించిన ప్రణాళికపై జాతీయ కమిటీ విశ్లేషించి సలహా ఇచ్చింది. గత సంవత్సరం నుండి పనిని పూర్తి చేయడమే కాకుండా, ప్రస్తుత సంవత్సరానికి ప్రణాళిక చేయబడిన పనులను వేగంగా ట్రాక్ చేయడానికి సమగ్ర ప్రయత్నాలు చేయాలని రాష్ట్రాన్ని కోరింది. 2021-22 నాటికి కర్ణాటకలో ఉన్న 30 జిల్లాల్లో 2 జిల్లాల్లోని గ్రామీణ గృహాలకు 100% ట్యాప్ నీటి కనెక్షన్ ఉండేలా చూడాలని రాష్ట్రం యోచిస్తోంది. ఇంటిలోనే కాకుండా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా సరఫరా చేసే నీటిని పరీక్షించాల్సిన అవసరాన్ని కమిటీ నొక్కి చెప్పింది.

పారదర్శకత మరియు జవాబుదారీతనం పెంచెందుకు కర్ణాటక రాష్ట్రం 'భూమి ఆన్‌లైన్ - పరిహారా' అని పిలిచే ఒక బలమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని అభివృద్ధి చేసింది. ఇది రోజువారీగా తాగునీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి శీఘ్రంగా మరియు సులభంగా యంత్రాంగాన్ని అందిస్తుంది.

జెజెఎం అనేది కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమం. దేశంలోని ప్రతి గ్రామీణ ఆవాసానికి ట్యాప్ ద్వారా త్రాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి 1,189 కోట్ల రూపాయల కేంద్ర నిధిని కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2021-22 రూ.3,000 కేంద్ర నిధులను రాష్ట్రం అందుకునే అవకాశం ఉ ంది. అందుకోసం గ్రామాల్లో గృహ కుళాయి నీటి కనెక్షన్‌ను సమకూర్చడానికి నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి రాష్ట్రానికి సరైన ప్రణాళిక అవసరం.

వార్షిక కార్యాచరణ ప్రణాళిక త్రాగునీటి వనరుల బలోపేతం/వృద్ధి, నీటి సరఫరా, గ్రే వాటర్ శుద్ధి మరియు పునర్వినియోగం, గ్రామంలోని నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ, ఐఇసి ప్రణాళిక, నీటి నాణ్యత పర్యవేక్షణ మరియు నిఘా, శిక్షణ వంటి సహాయక చర్యలకు సంబంధించిన ప్రణాళికను వివరిస్తుంది. 2021-22లో 14,000 గ్రామీణ ప్రజలకు మేసన్, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, మోటారు మెకానిక్స్, ఫిట్టర్, పంప్ ఆపరేటర్లుగా నైపుణ్య శిక్షణ ఇప్పించాలని రాష్ట్రం యోచిస్తోంది. గ్రామాల్లో నైపుణ్యం గల మానవ వనరులను సృష్టించడం వల్ల నీటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఉపయోగపడుతుంది.

జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రాలు / యుటిల వార్షిక కార్యాచరణ ప్రణాళిక (ఏఏపి) చేపట్టే నెల రోజుల కార్యక్రమం. ప్రతిపాదిత ఏఏపికు సంబంధించిన పరిశీలన చేయడానికి జల్ శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల సభ్యులు,నీతి విభాగాలు పనిచేస్తాయి. ఆ తరువాత జాతీయ బృందం క్రమం తప్పకుండా క్షేత్ర సందర్శనలతో పాటు సంవత్సరమంతా నిధులు విడుదల చేయబడతాయి. మిషన్ సజావుగా అమలు కావడానికి మరియు 'హర్ ఘర్ జల్' లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడటానికి సాంకేతిక సహాయాన్ని మార్గనిర్దేశం చేయడానికి మరియు అందించడానికి తరచూ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. 2021-22లో అదనంగా జల్ జీవన్ మిషన్ కోసం రూ 50,011 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిపారు. వాటితో పాటు 15వ ఫైనాన్స్ కమిషన్ టైడ్-గ్రాంట్ కింద రూ. 26,940 కోట్ల హామీ ఫండ్ అందుబాటులో ఉంది. వీటి ద్వారా నీరుడపారిశుధ్యం కోసం ఆర్ఎల్‌బి / పిఆర్‌ఐల ప్రయోజనం కలుగుతుంది. ఈ విధంగా 2021-22లో దేశవ్యాప్తంగా గ్రామీణ గృహాలకు ట్యాప్ నీటి సరఫరాను అందించేందుకు రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా పెట్టుబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చేయూతను అందిస్తుంది.

# చట్ట సభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి..ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 19: అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. త్వరలో వేలాది మందితో పార్లమెంట్ ముట్టడి జరపాలని నిర్ణయించినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 33 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడిచినా 56శాతం జనాభా గల బీసీలకు రాజ్యాధికారం కనీసం 15శాతం ప్రాతినిధ్యం లభించడం లేదని అన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీల గురించి పట్టించుకోవడం లేదని విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బీసీలు కేవలం ఓట్లేసే యంత్రాలుగా మిగిలిపోయారని అవేదన వ్యక్తం చేశారు. ఒక్క శాతం జనాభా లేని వారు ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు అయ్యారని 56శాతం జనాభా గల బీసీలకు ఏ ఉన్నత పదవి దక్కకపోవడం ప్రజాస్వామ్యానికి సవాల్‌గా మారిందన్నారు. ఉద్యోగ రంగంలో కూడా బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, సుధాకర్, రామూర్తి, చంద్రశేఖ ర్, చంటి, అనంతయ్య, నిఖిల్, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నేరుగా ప్రమోట్ ఆలోచన

హైదరాబాద్, ఏప్రిల్ 19: కరోనా నేపథ్యంలో పది, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రద్దైన విషయం తెలిసిందే. ఇక మిగిలిన 1 నుంచి 9వ తరగతి చదివే పాఠశాల విద్యార్థులందర్నీ కూడా ఎలాంటి పరీక్షలు లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేయాలని తెలంగాణ విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. వీరికి పరీక్షలు, ఫలితాలతో నిమిత్తం లేకుండా నేరుగా పై తరగతులకు పంపించాలని అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై మరో రెండు, మూడు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుంది. 2020-21 విద్యా సంవత్సరానికి 9, 10 తరగతులకు కొత్త అకాడమిక్ క్యాలెండర్‌ను ఈ ఏడాది జనవరిలో పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ క్యాలెండర్ ప్రకారం మే 26 వరకు స్కూళ్లు నడుస్తాయని, దీని ప్రకారమే 9, 10 తరగతుల వారికి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. మిగతా తరగతుల విద్యార్థులకు సంబంధించి దీనిపై స్పష్టత లేదు. సాధారణంగా అయితే 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం అకాడమిక్ క్యాలెండర్ జూన్ 12 నుంచి ఏప్రిల్ 23 వరకు ఉంటుంది. ఈ లెక్క ప్రకారం చూసుకుంటే ఇతర విద్యార్థుల విద్యా సంవత్సరం ముగింపునకు ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థు లకు పరీక్షలు ఉంటాయా? ఉండవా? అనే దానిపై స్పష్టత కొరవడింది. విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు పరీక్షలు లేకుండానే పై తరగతులకు ప్రమోట్ చేసే వెసులుబాటు ఉన్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో కరోనా విజృంభిస్తున్న కారణంగా వీరికి వార్షిక పరీక్షలు పెట్టే పరిస్థితులు లేనందున ఇదే విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను పరీక్షలు లేకుండానే పై తరగతులకు ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ సోషియో ఎకానమిక్ సర్వేలో వెల్లడించారు. అయితే దీనికి సంబంధించిన ఆదేశాలు మాత్రం పాఠశాలల యాజమా న్యాలకు ఇంకా అందలేదని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటు న్నాయి. 1 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు దాదాపు 53 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో ఇప్పటికే టెన్త్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రద్దు అయితే ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు మాత్రం వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన 2020-21 అకడమిక్ క్యాలెండర్ ప్రకారం 9, 10 తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ పేర్కొన్నది. కానీ 6 నుంచి 8వ తరగతుల వరకు మాత్రం పరీక్షల నిర్వహణపై స్పష్టత ఇవ్వలేదు. 9, 10 తరగతులకు మాదిరిగానే 6-8 తరగతులకు కూడా 2020-21 నూతన అకడమిక్ క్యాలెండర్ సిద్ధం చేస్తున్న క్రమంలో కరోనా కారణంగా విద్యాసంస్థలు మూతపడి పరీక్షలు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలోనే మిగిలిన తరగతి విద్యార్థులను కూడా పరీక్షలు లేకుండానే పై తరగతులకు పంపించాలని అధికారులు కసరత్తులు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలోనే రెండు, మూడు రోజుల్లో వెలువడ నున్నట్లు తెలిసింది.

### ప్రైవేట్‌లో ఆన్‌లైన్ పరీక్షలు

ఒక పక్క కరోనా కారణంగా పరీక్షలను రద్దు చేసే యోచనలో అధికారులు ఉంటే మరోపక్క ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కొందరు గుట్టుచప్పుడు కాకుండా వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు రచించారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదట ఈనెల 16 నుంచే వారికి పరీక్షలు నిర్వహించాలని అనుకున్నప్పటికీ అవి వాయిదా పడడంతో ఈనెల 26 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసి సమాధాన పత్రాలు మాత్రం పాఠశాలలకు నేరుగా విద్యార్థులే తీసుకురావాలని కండీషన్లు పెడుతున్నట్లు తెలిసింది. ఫీజుల కోసమే ఈ విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని

# కరోనా టీకా వేయించుకున్న మంత్రి గంగుల కమలాకర్




కరీంనగర్ ఏప్రిల్ 19: మంత్రి గంగుల కమలాకర్ నేడు కరోనా టీకా వేయించుకున్నారు.. కరీంనగర్ లోని ఆర్టీసీ వర్క్ షాప్ ఆస్పత్రికి వెళ్లిన ఆయన అక్కడ కరోనా వ్యాక్సిన్ తొలి డోస్ ను తీసుకున్నారు.. అంతకుముందు ఆయన హాస్పటల్ ను సౌకర్యాలను పరిశీలించారు. కొవిడ్ పరీక్షలను పరిశీలించారు.. వ్యాక్సిన్ ఎంత స్టాక్ ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని కోరారు.. వ్యాక్సిన్ పై ఎటువంటి అపోహాలు లేవని అన్నారు.. అలాగే ప్రతి ఒక్కరూ మాస్క్ లు ధరించాలని కోరారు? అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు..

# సంక్షోభంలోనూ రైతు సంక్షేమంపై దృష్టి



కరీంనగర్ ఏప్రిల్ 19: కరోనా మహమ్మారి ఒకపక్క ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తూ విపత్కర పరిస్థితి సృష్టిస్తున్నప్పటికీ ఇంత సంక్షోభంలోనూ రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టిన ఘనత దేశంలో ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెన్నంపల్లి, పెగడపల్లి, శ్రీరాంపూర్ గ్రామాల్లో ఐకెపి, శ్రీరాంపూర్, కూనారం సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు- చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మాస్కులు, శాని-టైజర్, అందుబాటు-లో ఉంచాలని, నీటి వసతి కల్పించాలన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా తెరాస ప్రభుత్వం పని చేస్తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు- చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనెటి సంపత్, జెడ్‌పిటిసి వంగల తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అని, సింగిల్విండో చైర్మన్లు చదువు రామచంద్రారెడ్డి, గజవెల్లి పురుషోత్తం, వైస్ చైర్మన్ బూసి సదాశివరెడ్డి, సర్పంచులు ఆడెపు శ్రీదేవి రాజు, బుర్ర మంగ సదానందం, ఆరెల్లి సుజాత రమేష్, కాసం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీ-సీలు జెట్టి దేవన్న, సుముఖం నిర్మల మల్లారెడ్డి, మాదాసి సువర్ణ చందు, ఏఓ నాగార్జున, ఏపీఎం సంఘ సదానందం, నాయకులు కొట్టే రవీందర్, జిన్నా రామచంద్రారెడ్డి, నిదానపురం దేవయ్య, ఈర్ల శ్రీనివాస్, ఎండి ఇబ్రహీం, కుమార్, నవీన్, కిరణ్, సిఈఓలు కొల్లేటి శ్రీనివాస్, బోడకుంట విజేందర్, సర్పంచులు, ఎంపీటీ-సీలు, రైతులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



కరీంనగర్ ఏప్రిల్ 19:మండలంలోని గుర్రాంపల్లి, మారేడుగొండ గ్రామాల్లో పెద్దపల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు- చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నరసింహరెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని చైర్మన్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు మాదిరెడ్డి భాగ్యలక్ష్మి, కన్నం జై, సిఈఓ మధుతోపాటు- పలువురు పాల్గొన్నారు.

# తెరాస పార్టీలోకి చేరికలు?.




వరంగల్, ఏప్రిల్ 19: గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండ, టేకులగూడెం గ్రామాల నుండి గుండాల కళ్యాణ్, నార్లాగిరి సతీష్, ఆర్మూల రాజుతో పాటు వివిధ పార్టీల నుండి సుమారు 100 మంది కార్యకర్తలు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సమక్షంలో తెరాస పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరూరి రమేష్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆవాల రాధికా రెడ్డి, పోలపల్లి రామ్మూర్తి, ఆకుతోట ప్రశాంత్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 19 (నేటినిజం ప్రతినిధి):: చందుర్తి మండల కేంద్రం నుండి మోత్కూరావు పేట గ్రామం వరకు రోడ్డు పనులకు వెంటనే ప్రారంభించాలని కోరుతూ నేడు మంగళవారం చందుర్తి మండల కేంద్రం నుంచి రోడ్డు ఆగిపోయిన అటవీ ప్రాంతం వరకు పాదయాత్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ పాదయాత్ర కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని చందుర్తి ఎంపీటీసీ సభ్యురాలు పులి రేణుక- సత్యం అన్నారు, సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతం అనుమతుల పేరిట గత కొద్ది సంవత్సరాలుగా రోడ్డు పనులు నిలిచిపోయాయి వెంటనే ఈ రోడ్డు పనులను ప్రారంభించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆది శ్రీనివాస్ నేతృత్వంలో ఈ పాదయాత్ర కార్యక్రమం జరుగుతుందని పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు,



# రాష్ట్ర వ్యాప్తంగా 1300 కేంద్రాలలో నిరంతరం వ్యాక్సినేషన్ -మంత్రి ఈటల



వరంగల్, ఏప్రిల్ 19:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 1300 కేంద్రాలలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మండలంలోని కమలాపూర్ ,ఉప్పల్ ,గూడూరు, అంబాల, ఉప్పల్ పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కమలాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఒక కోటి యాభై లక్షల విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజేందర్ మాట్లాడుతూ, కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా రైతులు గ్రామీణ ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పొలాల వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు మాస్కులు తప్పనిసరి ఉపయోగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 99% మందికి ఈ వైరస్ సోకిన కూడా ప్రాణభయం ఉండడం లేదని, ఒక శాతం మందికి మాత్రమే అలాంటి ప్రాబ్లమ్స్ వస్తున్నాయని మంత్రి అన్నారు. వ్యాక్సిన్ కొరత లేదని ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని, మొదటి డోస్ తీసుకున్న ప్రతి ఒక్కరూ రెండవ డోసు తప్పకుండా తీసుకోవాలని ఆయన గుర్తు చేశారు. కాగా మండలంలోని 16 గ్రామాలకు గాను నూట నలభై తొమ్మిది చెక్కులను మంత్రి ఈటెల చేతుల మీదుగా ఈ రోజు లబ్ధిదారులకు అందజేశారు. అందులో అంబాల కు 14, భీమ్‌నీపెల్లికి 6, దేశ రాజు పల్లి కి 3, గూడూరు 18 , గుండెడు కు8, గునిపర్తి 1, కమలాపూర్ కు 21, కానిపర్తి కి10, కన్నూరు కు 9, మరి పెల్లి గూడెం కు 8, నేరెళ్ల కు 1, శనిగరం కు 9, ఉప్పల్ కు 17, వంగపల్లి కి 13, వెంకటేశ్వర్ల పల్లికి 5, మాదన్నపేట గ్రామానికి 6 చెక్కుల చొప్పున మంత్రి ఈటెల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సింగిల్ విండో అధ్యక్షులు పేరాల సంపత్ రావు, తాసిల్దార్ జ్యోతి వరలక్ష్మిదేవి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

మెదక్, ఏప్రిల్ 19: రైతులు పండించిన వరి ధాన్యంలోని ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లి సొసైటీ ఐకేపి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పొద్చన్‌పల్లి, యూసుఫ్‌పేట, కుర్తివాడ, లక్ష్మీనగర్ సొసైటీ ఛైర్మర్ రమేష్, వైస్ ఎంపీపీ విష్ణువర్దన్‌రెడ్డి తో కలిసి ఆమె కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వ ఉంచకుండా తగిన లారీలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఎగుమతి చేయాలన్నారు. ఏగ్రేడ్ ధాన్యానికి 1888, సాధారణ రకం ధాన్యానికి 1868 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్నాథం, మాజీ ఆలయ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు అనురాధ ఏడుకొండలు, దాసు, శ్రీనాథ్‌రావు, ఆర్డీఓ సాయిరాం, తహాశీల్దార్ బలరాం, ఏవో ప్రతాప్, ఏఈఓలు రజిత, జనార్దన్, నాయకులు శ్రీనివాస్, రామాగౌడ్, కిష్టాగౌడ్ పాల్గొన్నారు.

# రైతుల లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించాలి




వికారాబాద్, ఏప్రిల్ 19:: రైతులు పండించిన పంటల సేకరణ, నాణ్యత, పంట వివరాలు లావాదేవీలు అన్ని ఇక నుంచి మొబైల్ ఆప్ ద్వారా ఆన్ -లైన్ లో నిర్వహించాలి. దీంతో పనులలో సౌలభ్యంతో పాటు సమయం ఆదా అవుతుందని జిల్లా కలెక్టర్ పౌసుమి బసు తెలిపారు. సోమవారం జిల్లాలోని మోమిన్ పేట మండల కేంద్రంలోని అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంపెనీ వ్యవహారాలు అన్నీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు గాను సీసీలు, ఏపీవోలకు పవర్ ప్రజెంటేషన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఇక నుంచి కంపెనీ లావాదేవీలు అన్నీ ఫార్మర్ మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించాలని, రైతులకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపర్చాలని సూచించారు.

రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నది. ఏ పంట వేశారు. ఎప్పుడు వేశారు. వేసిన పంట ఇప్పటి వరకు వస్తుంది. పండించిన పంట సేకరణ, మార్కెట్ తరలింపు, క్వాంటిటీ, అమ్మకాలు, ధరతో పాటు పంట తరలింపు వాహన వివరాలు అన్ని ఇందులో పొందు పర్చినట్లయితే పనులలో సౌలభ్యంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు.

రిజిస్టర్లు నిర్వహించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కంపెనీ అభివృద్ధికి అందరు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో కృష్ణన్, సెర్ప్ ఏపీడీ నర్సిములు, డీపీఎం శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి గఫూర్, కంపెనీ చైర్మన్ లు లక్ష్మి, ప్రమీల, ఏపీవోలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

వరంగల్, ఏప్రిల్ 19:మండలకేంద్రంలోని సోమవారం రైతు వేదిక భవనంలో నిత్యావసరాల తయారీ విధానాల అవగాహన సదస్సు కు ముఖ్యఅతిథిగా అదనపు డిఆర్డీఓ నూరొద్దీన్ పాల్గొన్నారు?? ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తి తో ఎదిగేలా పొదుపు సంఘాల ద్వారా ప్రత్యేక స్టోర్లు ఏర్పాటు చేయించి వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నారు ప్రతి గ్రామాలలోని మహిళాసంఘాల ఆధ్వర్యంలో ప్రజలకు కావలసిన సరుకులు మిర్చి,పసుపు,అల్లంవెల్లుల్లి,చింతపండు,నూనె తదితర నిత్యావసరాలను ప్రతీ గ్రామంలో ఒక ఎస్. హెచ్.జి కిరాణా షాపును ఏర్పాటు చేసి ప్రజలకు కావలసిన కల్తీ లేని నిత్యావసరాలను అందించాలని. అన్నారు. ఈకార్యక్రమంలో డిపిఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం.. సురేందర్,ఏపీఎస్,సీసీఎస్,ఆయా మహిళ సంఘాల పాల్గొన్నారు.

## కమ్మారెడ్డిపల్లిలో పర్యటించిన డా. కె. సుధాకర్ లాల్..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19:మండలం కమ్మారెడ్డి పల్లిలో కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయిన 42 మంది బాధితుల ఇంటి ఇంటికి తిరుగుతూ వారి ఆరోగ్య పరిస్థిని.. వారి కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. సుధాకర్ లాల్.ఈ సందర్భంగా జిల్లా వైద్య .. ఆరోగ్య శాఖ అధికారి డా. కె. సుధాకర్ లాల్ మాట్లాడుతూ జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్నాయని ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పాజిటివ్ నిర్ధారణ అయిన వారు హోమ్ ఐసోలాషన్ లో ఉండాలని.. వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య సలహాలు పాటించాలని ఆందోళన చెందొద్దని.. వైద్యులు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉన్నారని ఏ విధమైన అత్యవసర పరిస్థితులు ఉన్న తక్షణమే స్పందిస్తామన్నారు. సాధారణ ప్రజలు సైతం అత్యవరవైతే తప్ప బయటికి రావద్దని ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కరోనా ప్రమాదం పొంచి ఉందన్న నిజాన్ని గుర్తించాలని అన్నారు. అనుమానితులు అందరూ పరీక్షలు చేయించుకొని జాగ్రత్తగా ఉండాలని, పాజిటివ్ వచ్చిన వారి కుటుంబ సభ్యులకు వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉందని.. పాజిటివ్ నిర్ధారణ అయినవారితో ఏమాత్రం కలిసామన్న అనుమానం ఉన్నా, లక్షణాలు లేకున్నా పరీక్షలు చేయించుకోవాలన్నారు.. టెస్టింగ్, ట్రీట్మెంట్ ద్వారానే కరోనాని నివారించగలుగుతామని సూచించారు.

ఒక్క కమ్మారెడ్డి పల్లి గ్రామంలోనే 42 మంది బాధితులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో సాధారణ ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పారు. మాస్కులు ధరించడంతో పాటు చేతులని తరచు శుభ్రం చేసుకోవాలని.. భౌతిక దూరం పాటించాలని జన సమూహాల్లోకి వెళ్ళొద్దని యువత బాధ్యత తో మెలగాలని జిల్లాలోని పౌరులు అందరూ క్రమం తప్పకుండా ప్రభుత్వ సూచనలు పాటించాలని వైద్య సిబ్బందికి సహకరించి కోవిడ్ వ్యాప్తిని అరికట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డా. ప్రదీప్, సూపర్ వైజర్ ఫాసియొద్దీన్.. వైద్య సిబ్బంది.. ఏ.ఎన్.ఎంలు ఆశా కార్యకర్తలు, పోలీస్ శాఖఅధికారులు, సిబ్బంది గ్రామ ఉప సర్పంచ్ జానకి రాంరెడ్డి పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్‌లో ఇతర పార్టీల పని అయిపోయింది

వరంగల్, ఏప్రిల్ 19:రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇతర పార్టీల పనైపోయిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గ్రేటర్ ఎన్నికలపై వరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అధికార పార్టీ నేతలే ఒకరికి ఒకరు పోటీ పడి వారి పరిధిలో మెజారిటీ సాధించాలన్నారు.హైదరాబాద్ తర్వాత వరంగల్ అంటే సిఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. అందుకే బడ్జెట్‌లో ఈ నగరానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

వచ్చే పది రోజులు అన్ని పనులు పక్కన పెట్టి ఎన్నికల కోసం మనం కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల పనైపోయింది. మనమే సమన్వయం చేసుకొని సత్తా చాటాలన్నారు.

సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ఆరూరి రమేష్, జడ్పీ చైర్ పర్సన్ కుమారి బిందు, ఇతర నేతలు పాల్గొన్నారు

## క్లాక్ టవర్ నిర్మాణ పనులను సుందరంగా తీర్చిదిద్దాలి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19::మహబూబ్ నగర్ పట్టణంలో నిర్మిస్తున్న జంక్షన్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్లతో సైట్ మ్యాపును పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ పట్టణం హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. అందుకు అనుగుణంగా పట్టణ సుందరీకరణ పనులలో భాగంగా అన్ని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు.పట్టణంలో ప్రధాన కూడలి క్లాక్ టవర్ చౌరస్తాను మహబూబ్ నగర్ పట్టణానికే మణిహారంగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# సైఫన్ సిస్టం సామర్థ్యం పెంచాలని ఈఎన్సీకి వినతి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19: ఆసియాలోనే మొట్టమొదటి సైఫన్ సిస్టంతో పనిచేసే సరళా సాగర్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచాలని కోరుతూ.. నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్ రావును దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కలిశారు. సామర్థ్యం పెంపుతో అదనపు ఆయకట్టు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఈఎన్సీకి విజ్ఞప్తి చేశారు.దీనితో పాటు మూసాపేట మండలం నిజాలాపూర్ చెక్ డ్యాం ఎత్తు పెంచాలని, దీని ద్వారా అదనంగా 1200 ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వస్తుందన్నారు.

చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామ చెరువు నుంచి అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణం చేపట్టాలని తద్వారా జమ్మికుంట, నల్లకుంట, ఎర్రకుంట చెరువులు నింపి ఆయకట్టును పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈ అంశాలపై సీఎం కేసీఆర్ కు సైతం వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

# తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 19:తెలంగాణలో ఈనెల 30న ప్రభుత్వం తలపెట్టిన స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కరోనా కేసులు శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీలకు జరిగే ఎన్నికలతో పాటు మరికొన్ని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లోని ఖాళీలకు నిర్వహించే ఉపఎన్నికలను వాయిదా వేయాలని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్ర ఎన్నికల సంఘమేనని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూన్ 7వ తేదీకి వాయిదా వేసింది. అయితే పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

# క్రాంప్టన్ ఆప్టిమస్ 65 ఎసీడిజర్ట్ కూలర్లు "జల్ది కూలింగ్" మార్కెట్లోకి




హైదరాబాద్, ఏప్రిల్ 19: వేసవి ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ, ఇంట్లో అంతిమ సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించే వేగవంతమైన మరియు పరిపూర్ణమైన శీతలీకరణకు ఎయిర్ కూలర్లు తప్పనిసరిగా ఉండాలి. 75సంవత్సరాల అనుభవాన్ని తీసుకువచ్చిన క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ దాని స్మార్ట్ బల్బులు స్మార్ట్ ఫ్యాన్లతో పాటు దాని స్మార్ట్ పర్యావరణ వ్యవస్థకు మరో ఆవిష్కరణను జోడిస్తుంది. ట్రస్ట్ మన్నిక యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, కంపెనీ ఆప్టిమస్ సిరీస్‌లో తన అధునాతన శ్రేణి ఎసీ-ఎనేబుల్డ్ కూలర్‌లను ఆవిష్కరించింది.ఆప్టిమస్ 65 ఎసీ ఎడారి కూలర్లు స్మార్ట్ గృహాలను మరింత సౌకర్యవంతంగా చేయటానికి వినియోగదారుల పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి, ఎక్కడైనా ఎప్పుడైనా సౌకర్యం మరియు సౌలభ్యాన్ని అందించే స్మార్ట్ లక్షణాలతో క్లాస్ శీతలీకరణలో ఉత్తమంగా అందిస్తుంది.భారత వేసవికాలాలు దేశంలోని అనేక ప్రాంతాలలో ఇప్పటికే మునుపటి కంటే ఎక్కువ వేడి తీవ్రతను అనుభవిస్తున్నాయి.కొత్త సాధారణ పరిస్థితులకు అనుగుణంగా, మనలో ఎక్కువ మంది ఇంటి లోపలే ఎక్కువ సమయం గడుపుతున్నందువలన, చెమట కక్కుతున్న వేడి నుండి తక్షణ ఉపశమనం అవసరం. అందువల్ల, కూలర్లు ఎప్పుడైనా ఉత్తమమైన శీతలీకరణ సౌకర్యాన్ని అందించడం మరియు ముఖ్యంగా దేశంలోని వేడి పొడి ప్రాంతాలలో, ఇంటిలోని ప్రతి మూలను చల్లబరచడానికి తగినంత పోర్టబుల్ కావడం ముఖ్యం. వినియోగదారులు మరింత సాంకేతికతతో నడిచే ఉన్నతమైన ఉత్పత్తుల కోసం చూస్తున్నప్పుడు, ఇప్పుడు ఎసీకార్యకలాపాలతో కూడిన కూలర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి రోజువారీ పనులను సౌకర్యవంతంగా హాయిగా నిర్వహించడానికి వీలు కల్పిస్తాయి. ఆప్టిమస్ ఎడారి కూలర్లు 2020లో ఆవిష్కరించబడ్డాయి - దాని అల్ట్రా-వైడ్ 18"ఫ్యాన్లతో అత్యధిక గాలి సరఫరా అధిక సాంద్రత కలిగిన హనీకొంబ్ వాడకాన్ని అందిస్తుంది, ఇది ఉన్నతమైన శీతలీకరణను ఇవ్వడానికి సహాయపడుతుంది. ఈ రెండింటి యొక్క మిశ్రమ ప్రభావం, తద్వారా, అత్యధిక ఉష్ణోగ్రత రోజున కూడా జల్ది శీతలీకరణను అందించడానికి సహాయపడుతుంది. మొత్తం వినియోగదారు అనుభవాన్ని పెంచే లక్ష్యంతో, క్రాంప్టన్ తన కొత్త శ్రేణి కట్టింగ్-ఎడ్జ్ డిజర్ట్ ఎయిర్ కూలర్లు ఆప్టిమస్ 65 ఎసీ లను ఆవిష్కరించింది, దీనిని ఏ ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ స్మార్ట్ ఫోన్‌ను అమెజాన్ అలెక్సా గూగుల్ హోమ్ వంటి వాయిస్ అసిస్టెంట్లను కూడా ఉపయోగించైనా నియంత్రించవచ్చు. పిఎమ్ 2.5 ఫిల్టర్, యాంటీబాక్ నాబ్స్ మరియు ప్యానెల్స్‌తో పాటు స్మార్ట్ ఎసీఆపరేషన్లతో శక్తినిచ్చే ప్యూర్‌షీల్డ్ టెక్నాలజీతో అప్‌గ్రేడ్ చేసినది, అత్యధిక ఉష్ణోగ్రత ఉన్న రోజున కూడా తక్షణ శీతలీకరణను నిర్ధారిస్తుంది, కనీస నిర్వహణ, మంచి అవగాహనతో జీవించడం ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన వాతావరణంతో హామీ ఇస్తుంది.

# హైదరాబాద్ లో వర్షం..

హైదరాబాద్, ఏప్రిల్ 19:గత కొన్ని వారాలుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న భాగ్యనగర వాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో నిన్న రాత్రి చిరు జల్లులు కురిశాయి. ఈ తెల్లవారుజాము వరకూ పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉపరితల ద్రోణి ప్రభావంతోనే ఈ చిరు జల్లులకు అవకాశం ఏర్పడిందని, కొన్ని ప్రాంతాల్లో నేడు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కూకట్ పల్లి, అమీర్ పేట, ఖైరతాబాద్, మలక్ పేట, దిల్ సుఖ్ నగర్, మాదాపూర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో నిత్యమూ రాత్రిపూట నమోదయ్యే సగటు ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీల మేరకు తగ్గాయి. తెలంగాణతో పాటు ఆంధ్రాలో కూడా పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. నేడు రేపు కూడా ఓ మోస్తారు జల్లులు కురిసే అవకాశం ఉంది.

# దంతాలను పరిశుభ్రంగా ఉంచుకొండి - లేకుంటే

## -కోవిడ్ మీ శరీరంలో-సులభంగా చేరుతుంది-

హైదరాబాద్, ఏప్రిల్ 19:కోవిడ్ వైరస్ మనిషి లోనికి ప్రవేశించే మార్గాలు కళ్ళు, ముక్కు మరియు నోరు కాగా, ఎక్కువగా నోటి నుండే వైరస్ మనిషిలోకి ప్రవేశిస్తుంది.

అయితే ఎవరైతే దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోరో వారికి మరింత త్వరగా వ్యాధి వస్తుంది. ఎందుకంటే నోటి ద్వారా ప్రవేశించిన వైరస్ ముందుగా చిగుళ్లపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఒకవేళ దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా లేకుంటే మనిషి పై కోవిడ్ ఇంకా ఎక్కువగా తీవ్రంగా ఉంటుంది, ఎందుకంటే ఆ వైరస్ ఆరోగ్యంగా లేదా పరిశుభ్రంగా లేని దంతాలు, చిగుళ్ల ద్వారా మనిషి శరీరంలోనికి వేగంగా ప్రవేశిస్తుంది అని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ దంతవైద్యులు ×డా. ఆకాశ్ చక్రవర్తి× అన్నారు...

జగిత్యాలలో డా. ఆకాశ్ ఆల్ ఆన్ ఫోర్ అనే ఒక అరుదైన దంత శస్త్ర చికిత్స ద్వారా రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ఒకేసారి 28 దంతాలను అమర్చారు.

ఈ సందర్భంగా జగిత్యాలకు వచ్చిన డా. ఆకాశ్ ఒక దంత వైద్యశాలలో జరిపిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను ఈ రోజు చేసిన దంత చికిత్స చాలా అధునాతన, అరుదైనది అని అన్నారు.

దేవుడిచ్చిన దంతాలను కాపాడుకోలనీటే వాటిని క్రమపద్ధతిలో ప్రతిరోజు శుభ్రంగా ఉంచుకోవడం తప్ప వేరే మార్గం లేదన్నారు.

# కరోనా ఎఫెక్ట్: ఇండియాలో రద్దయిన బ్రిటన్ ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ,ఏప్రిల్ 19:: ఇండియాలో కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పర్యటన రద్దయింది. ఈ నెల చివర్లో బోరిస్ జాన్సన్ ఇండియాకు రావాల్సి ఉంది. అయితే భారీగా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఇప్పుడు పర్యటనను రద్దు వేశారు. రెండు దేశాల పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. రెండు దేశాల మధ్య సంబంధాల విషయంపై చర్చించడానికి రానున్న రోజుల్లో వర్చువల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది.

నిజానికి గణతంత్ర వేడుకలకే బోరిస్ జాన్సన్ ముఖ్య అతిథిగా వస్తారని భారత ప్రభుత్వం చెప్పింది. అయితే ఆ సమయంలో బ్రిటన్‌లో కరోనా ఉధృతి ఎక్కువగా ఉన్నందున పర్యటన రద్దు చేసుకున్నారు. అప్పుడు రాలేకపోయినందుకు ఆయన ఏప్రిల్ చివరి వారంలో ఇండియా పర్యటనకు వస్తారని బ్రిటన్ ప్రకటించింది. కానీ ఇప్పుడు ఇక్కడ కేసులు ఎక్కువ అవుతుండటంతో మరోసారి ఆయన పర్యటన వాయిదా పడింది.

# కేరళ వ్యక్తి చేతిలో జీవం పోసుకున్న బుల్లి మహీంద్ర జీపు

తిరువనంతపురం, ఏప్రిల్ 19: : పిల్లలకు ఇష్టమైన బొమ్మలు కొనడం సర్వసాధారణం. జాతరలకు వెళ్లినప్పుడో, పండుగల సమయాల్లోనో ఇంటి ముందుకు వచ్చే బొమ్మలు, బూరలు కొనాలంటూ పిల్లలు మారాం చేయడం, తల్లిదండ్రులు బేరాలాడి ఏదో ఒకటి కొనివ్వడం చేస్తుంటారు. అయితే, కేరళకు చెందిన ఒక వ్యక్తి తన పిల్లలు ఆడుకోవడానికి ఏకంగా ఒక చిన్న జీపునే తయారుచేసి ఇచ్చాడు.

మలప్పురం జిల్లాలోని అరికోడ్ నివాసి షకీర్ తన పిల్లలు ఆడుకోవడం కోసం ఒక చిన్న సాఫ్ట్ టాప్ మహీంద్రా జీవును తయారుచేయాలని నిశ్చయించుకున్నాడు. దానికి అవసరమైన అన్ని వస్తువులను తయారుగా పెట్టుకుని జీపును సిద్ధం చేసి పిల్లల చేతిలో పెట్టాడు. అతడు తయారు చేసిన రెప్లికా జీపు వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో రౌండ్లు కొడుతోంది.మహీంద్రా జీప్‌కు ప్రతిరూపమైన ఈ జీప్ 1000 వాట్స్ మోటారుతో పనిచేస్తుంది. మాన్యువల్ గేర్‌బాక్స్, పవర్ స్టీరింగ్, వేరు చేయగలిగిన సాఫ్ట్ టాప్, హెడ్‌లైట్స్.. అన్ని నిజమైన జీపులో మాదిరిగానే అమర్చాడు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి షకీర్‌కు సంవత్సరం పట్టింది.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో.. షకీర్ తాను తయారుచేసిన రెప్లికా జీప్‌తో నవ్వులు చిందిస్తూ ఎలా తయారుచేసిందీ వివరించాడు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com